వనదుర్గామాతను దర్శించుకున్న ఎస్పీ

దుర్గమ్మను దర్శించుకున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

పాపన్నపేట, నవంబర్ 15: ఏడుపాయ వన దుర్గాభవానీ మాతను ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి దంపతులు శుక్రవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. వీరి వెంట పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ

కొల్చారం, నవంబర్ 15: రాంపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. ఆయన వెంట మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్సై మహమ్మద్ గౌస్, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు ఉన్నారు.

పరీక్షను సమన్వయంతో నిర్వహించాలి

- గ్రూప్ -3 పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే కేంద్రాల గేట్లు మూసివేత
- పరీక్ష రాసే అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలి: అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 17, 18 వ తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగే గ్రూప్-3 పరీక్షలకు జిల్లాలో 5867 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ -6, రూట్ ఆఫీసర్స్ -6, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్ -19 మంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరూ పరీక్ష కేంద్రం లోకి మొబైల్ ఫోన్ తీసుకెళ్లవద్దని స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా తనిఖీ గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఆదేశించారు. ఆర్టీసీ అధికారులు అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడిపించాలన్నారు. సెస్ అధికారులు విద్యుత్ సరఫరాలో లోపం లేకుండా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు ఉండాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద తాగునీరు, టాయిలెట్లు సక్రమంగా ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షా పేపర్లు భద్రపర చేందుకు స్ట్రాంగ్ రూము ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షకు పటిష్టమైన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఒక్కో సెంటర్‌కు ఐదుగురితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, అందరి సమన్వయంతో పటిష్ట భద్రత నడుమ పరీక్షలు విజయవంతంగా కొనసాగడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అభ్యర్థులకు కీలక సూచనలు

అభ్యర్థులు టీజీపీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా గ్రూప్-3 హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ నగేశ్ అభ్యర్థులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. పరీక్షార్థులు హాల్ టికెట్ ను ఏ4 సైజ్ పేపర్ లో కలర్ ప్రింట్ తీసుకోవాలని సూచించారు. హాల్ టికెట్ పై అభ్యర్థులు తమ తాజా పాస్ పోర్టు ఫోటోను అతికించాలన్నారు. డౌన్లోడ్ చేసిన హాల్ టికెట్ పై ఫోటో సరిగా ముద్రించి లేకుంటే, అభ్యర్థి గెజిటెడ్ అధికారి లేదా చివరగా చదువుకున్న విద్యాసంస్థ ప్రిన్సిపాల్ అటెస్ట్‌తో మూడు పాస్ పోర్టు ఫోటోలతో పాటు వెబ్ సైట్ లో పొందుపరిచిన ధ్రువీకరణ పత్రాన్ని పూర్తి చేసి ఇన్విజిలేటర్ కు అందించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే 9:30 గంటలకు గేట్లు మూసివేస్తామని, పరీక్ష రాసే అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలని, అభరణాలు ధరించరాదని సూచించారు. పరీక్షార్థులు మెహిందీ, తాత్కాలిక టాటూలను వేసుకోరాదని స్పష్టం చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులు హాల్ టికెట్‌ను, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో పాటు గుర్తింపు పొందిన ప్రభుత్వ ఒరిజినల్ ఐడెంటిటీ కార్డును తప్పనిసరిగా తమ వెంట తీసుకెళ్లాలని అదనపు కలెక్టర్ సూచించారు. పరీక్ష సమయ పాలనకు సూచికగా ప్రతీ అర్ధగంటకోసారి బెల్ మోగుతుందని తెలిపారు.

చిన్నారులకు ఫుట్‌బాల్, హాకీలో ఉచిత శిక్షణ

చిన్నారులకు ఫుట్‌బాల్‌లో శిక్షణ ఇస్తున్న బొంతల సత్యనారాయణ

రామాయంపేట, నవంబర్ 15: ఫుట్‌బాల్, హాకీ ఆటల్లో చిన్నారులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ధ్యాన్‌చంద్ అసోషియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బొంతల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ కళాశాల గ్రౌండ్‌లో ఉచితంగా హాకీ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫుట్‌బాల్ లోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు

మూడు రోజుల పాటు ప్రతిష్ఠాపనోత్సవాలు

ముస్తాబైన సంజీవాంజనేయస్వామి ఆలయం

కౌడిపల్లి, నవంబర్ 15: మండలంలోని ధర్మాసాగర్ గేటు సమీపంలో నిర్మించిన సంజీవాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ నేటి నుంచి మూడు రోజుల పాటు పురోహితుడు కొలచాల రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు హనుమాన్ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి యతివర మాధవానంద సరస్వతి స్వామి వారి ఆశిస్సులతో ఈనెల 18న యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన ముగింపు ఉంటుందన్నారు.

పరిస్థితి విషమించి బాలిక మృతి

సాయిప్రియ (ఫైల్)

రామాయంపేట, నవంబర్ 15: మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలిక చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన మండలంలోని రాయిలాపూర్ గ్రామంలో జరిగింది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయిలాపూర్ గ్రామానికి చెందిన ల్యాగల సాయిప్రియ (14) తన బాబాయ్ బైక్‌పై రామాయంపేట నుంచి సిద్దిపేట వైపు ఓ పెళ్లికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొన్నది. ఈ ప్రమాదంలో సాయిప్రియ, ఆమె బాబాయ్ హరి ప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని చికిత్స కోసం సిద్దిపేట దవాఖానకు తరలించారు. సాయిప్రియ కోమాలోకి వెళ్లడంతో వెంటనే హైదరాబాద్‌లోని యశోద,అక్కడ నుంచి గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సాయిప్రియ శుక్రవారం మృతి చెందింది.

ఇంటింటి సర్వేను సమగ్రంగా నిర్వహించాలి

కౌడిపల్లి, నవంబర్ 15: ఇంటింటి సర్వేను సమగ్రంగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కౌడిపల్లిలో చేస్తున్న సర్వే పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో కరీముల్లా, కార్యదర్శి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల ధర్నాను విజయవంతం చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 15: సమగ్ర శిక్షా ఉద్యోగుల క్రమబద్ధీకరణ సాధనకు రాష్ట్ర స్థాయి మహాధర్నాకు తరలిరావాలని సీఆర్పీ జిల్లా అధ్యక్షుడు గట్టయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద శనివారం ధర్నా చేయనున్నట్లు పేర్కొన్నారు. సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.

మెదక్ మున్సిపాలిటీ: కొదండ రామాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నర్సాపూర్ మండలంలోని రుస్తుంపేట్ ఆత్మానంద ఆశ్రమం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మెదక్‌రూరల్: కొయ్యగుట్ట మల్లన్న ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు, చిన్నారులు

వెల్దుర్తి: మానేపల్లి రాజరాజేశ్వర ఆలయంలో

కార్తీక కాంతుల్లో..

- ఆలయాల్లో వైభవంగా పౌర్ణమి ఉత్సవాలు
- దీపకాంతుల్లో మెరిసిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు చేసి తరించిన భక్తజనం

కౌడిపల్లి: తునికి నల్లపోచమ్మ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పాపన్నపేట: ఏడుపాయల్లో కార్తిక దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ పూజారులు

రామాయంపేట: అయ్యప్ప ఆలయంలో శివుడికి అభిషేకాలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

మెదక్ మున్సిపాలిటీ/రామాయంపేట/మెదక్‌రూరల్/పెద్దశంకరంపేట/నర్సాపూర్/వెల్దుర్తి/శివ్వంపేట/ పాపన్నపేట/ కౌడిపల్లి,నవంబర్ 15: జిల్లా అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. తెల్లవారుజామున భక్తులు చన్నీటి స్నానాలు ఆచరించి ఆలయాల్లోని దేవతామూర్తులకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ప్రభాత వేళ నుంచి రాత్రి పౌర్ణమి చంద్ర దర్శనం అయ్యే వరకు కోవెల ధ్వజస్తంభాల వద్ద ఆలయాల ప్రాంగణాల్లో ప్రమిదల్లో, ఉసిరి కాయల్లో వత్తులు ఉంచి కార్తిక దీపాలు వెలిగించారు. కార్తికమాస పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయాల్లో దీపోత్సవం నిర్వహించారు. శైవ క్షేత్రాల్లో శివుడికి పంచామృత అభిషేకాలు, విశేషాలంకరణ, బిల్వ పత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సత్యనారాయణ వత్రాలు నిర్వహించారు. ఇందులో భాగంగా భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయాల్లోని ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. హోమాలు, నైవేద్యాలు, మంగళహారతులు సమర్పించారు. అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఇండ్లల్లో తులసీ మొక్కలు, ఉసిరి చెట్లకు పూజలు చేశారు. వత్తుల హోమం చేశారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తిక పౌర్ణమి సందర్భంగా శివ్వంపేటలోని బగలాముఖి శక్తిపీఠంలో వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

చిన్నశంకరంపేట: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని కామారంలోని ఎల్లమ్మ దేవాలయంలో 365 ప్రమిదలు వెలిగించిన భక్తులు

పాపన్నపేట: వనదుర్గామాత ఆలయం ఎదుట కార్తిక దీపోత్సంలో పాల్గొన్న అశేష భక్తజనం

శివ్వంపేట: బగలాముఖి శక్తిపీఠంలో భక్తులకు ప్రవచనాలు చేస్తున్న శాస్త్రుల వెంకటేశ్వరశర్మ

సమగ్ర సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- 'బిర్సా ముండా' గొప్ప మహనీయుడు
- జయంతిలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, (నమస్తే తెలంగాణ)/ మెదక్‌రూరల్ నవంబర్ 15: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మెదక్ మండలంలోని రాజ్‌పల్లిలో సర్వేను పరిశీలించారు. సర్వే ఫారాల్లో తప్పులేకుండా నమోదు చేయాలని, లక్ష్యాన్ని పూర్తి చేసే బాధ్యత ఎనూమరేటర్లదేనన్నారు. ప్రభుత్వ మారదర్శకాలు పాటిస్తూ ముందుకెళ్లాలన్నారు. అనంతరం కొంటూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. రైతులు ధాన్యం విక్రయాల్లో నాణ్యతను పాటించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో తరలించి, రైతులకు చెల్లింపులు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెదక్‌లోని చామండేశ్వరీ రైస్‌మిల్లులో ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం లోడింగ్ అన్‌లోడింగ్‌ను త్వరితగతిన చేయాలన్నారు. రైతులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘు, పంచాయతీ కార్యదర్శి నవీన్, సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి

గిరిజన బిడ్డల అభ్యున్నతి, ఆదివాసి హక్కుల కోసం సముచిత లక్ష్యం దిశగా పోరాడిన గొప్ప మహనీయుడు బిర్సా ముండా అని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ధర్తి ఆబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్, సంబంధిత గిరిజన సంక్షేమ అధికారులతో కలిసి బిర్సా ముండా చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ప్రధాని మోదీ రూ.6,900 కోట్లతో ధర్తి ఆబ జన గ్రామ ఉత్కర్ష్ అభియాన్ సంకల్పం పథకాన్ని ప్రారంభించారన్నారు. జిల్లాలోని 10 మండలాలు నర్సాపూర్, హవేళీఘనపూర్, రామాయంపేట, కౌడిపల్లి, నర్సాపూర్, పాపన్నపేట్, టేక్మాల్, రేగోడు, మాసాయిపేట, చిన్నశంకరంపేటను ఎంపిక చేశారన్నారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపించాలన్నారు.

కొల్చారంలో..

కొల్చారం, నవంబర్ 15: ధాన్యం తరలింపులో పోలీసులు సహకరిస్తారని, రోడ్డు భద్రత విషయంలో రైతులు సహకరించాలని మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్సై మహమ్మద్ గౌస్‌తో కలిసి పోతంశెట్టిపల్లి చౌరస్తా, కొల్చారం గ్రామాలను సందర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకెళ్లి తూకాన్ని పరిశీలించారు. వారితో పీఏసీఎస్ చైర్మన్ మనోహర్, సీఈవో కృష్ణ, నాయకులు రాజా గౌడ్, నింగొళ్ల చెన్నయ్య, గ్యాస్ కృష్ణ, ఎల్ శ్రీనివాస్ ఉన్నారు.

పచ్చని చెట్లకు నిప్పుపెట్టిన మహిళ

కాలిపోతున్న పచ్చని చెట్లు

చిన్నశంకరంపేట, నవంబర్ 15: మండలంలోని ఖాజాపూర్ వద్ద శాలిపేట, రామాయంపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న మొక్కల ఆకులు ఎండిపోయాయి. గ్రామస్తులు వద్దని వారించినా ఈ ఆకులకు ఒక మహిళ మంట పెట్టింది. దీంతో ఆ వేడికి చెట్లు వాడిపోయాయి. సదరు మహిళపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట, నవంబర్ 15: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయలైన ఘటన మండలంలోని సూరారం శివారులో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన కిషన్ చిన్నశంకరంపేటకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. చేగుంట మండలం పోలంపల్లికి చెందిన రమేశ్ సూరారం గ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. గ్రామ శివారుకు రాగానే ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను పోలీసులు మెదక్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

ఆన్‌జాబ్ శిక్షణను అలవర్చుకోవాలి

ఎలక్ట్రికల్‌లో శిక్షణ ఇస్తున్న లెక్చరర్లు

రామాయంపేట, నవంబర్ 15: ఒకేషనల్ కోర్సులో ఆన్‌జాబ్ శిక్షణను అలవర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎల్క్ట్రికల్ దుకాణంలో విద్యార్థులకు శిక్షణను అందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బాలప్రకాశ్ ఉన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్ హోదా

అధ్యాపకులు సిబ్బందితో న్యాక్ బృందం(ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 15: మెదక్ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్ హోదా గుర్తింపునిచ్చింది. ఈనెల 5, 6వ తేదీల్లో న్యాక్ బృందం కళాశాలను సందర్శించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అర్చన కులకర్ణి మాట్లాడుతూ న్యాక్ 'ఏ' గ్రేడ్ గుర్తింపుతో రాబోయే ఐదేండ్లలో కళాశాల అభివృద్ధికి నిధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ నిధులతో కాలేజీకి కావాల్సిన పరికరాలు, వివిధ అభివృద్ధి పనులకు కేటాయిస్తామన్నారు. కళాశాలలో కొత్త కోర్సులు ఏర్పాటుచేసుకోవడానికి వీలుంటుందన్నారు. అధ్యాపకులు, సిబ్బంది సహకరించడంతోనే కళాశాలకు న్యాక్ గుర్తింపువచ్చిందన్నారు.

గోశాలకు పశుగ్రాసం అందజేత

శివ్వంపేట, నవంబర్ 15: దొంతి గ్రామంలోని వేణుగోపాలస్వామి గోశాలకు తూప్రాన్‌కు చెందిన వ్యాపారి గంప సిద్దిరాములు దంపతులు రూ.30 వేల పశుగ్రాసాన్ని శుక్రవారం అందజేసినట్లు నిర్వాహకుడు శ్రీనివాస్‌గుప్తా తెలిపారు.

పుస్తెమట్టెలు అందజేత

నిజాంపేట, నవంబర్ 15: నస్కల్‌లోని మసీద్‌లో శుక్రవారం జరిగిన జావీద్ సోదరి వివాహానికి లీల గ్రూప్ చైర్మన్ మోహన్‌నాయక్ పుస్తెమట్టెలు అందజేశారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, నవంబర్ 15: బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మండలంలోని గజగట్లపల్లి పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండారు యాదగిరి కుమారుడు అనారోగ్యంతో మృతిచెందాడు. ఇదే గ్రామంలో రమేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించారు. ఇదే గ్రామానికి చెందిన నరేశ్, సురేశ్‌లను ఆమె పరామర్శించారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు రవీందర్, నాగభూషణ్, యాదగిరి, శంకర్, రాజు, శ్రీకాంత్, రమేశ్, నాగరాజు, రాజ్‌కుమార్ ఉన్నారు.

ఉచిత ఆటో సదుపాయం

నర్సాపూర్, నవంబర్ 15: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని శివాలయానికి వెళ్లే 10, 11వ వార్డు ప్రజలకు ఉచిత ఆటో ప్రయాణ సదుపాయాన్ని 10వ వార్డు కౌన్సిలర్ బుచ్చేశ్‌యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. సమస్యలు సత్వర పరిష్కారానికి ఉచిత హెల్ప్‌లైన్ నెంబర్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజేందర్, నాయకులు రాంరెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రావు, ప్రభాకర్ గుప్తా, సాహెబ్ పాల్గొన్నారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం

మెదక్ అర్బన్, నవంబర్ 15: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని మెదక్ డిపో మేనేజర్ సురేఖ తెలిపారు. శుక్రవారం మెదక్ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 11 మంది ప్రయాణికులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మెదక్, బొడ్డుటిప్‌పల్లి రూట్‌లో బస్సుల సంఖ్య పెంచాలని, నర్సాపూర్ రూట్‌లో ఉదయం బస్సు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆర్ఇటిక్యాలలో గ్రంథాలయం ఏర్పాటు

గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న సీఐ

రేగోడ్, నవంబర్ 15: ఆర్ ఇటిక్యాల గ్రామంలో యువకుల చొరవతో గ్రంథాలయం ఏర్పాటు చేసుకున్నారు. శుక్రవారం ఈ గ్రంథాలయాన్ని సీఐ రేణుకారెడ్డి, ఎస్సై పోచయ్య ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ తమ గ్రామంలో గ్రంథాలయ ఏర్పాటులో ముఖ్య పాత్ర పోషించిన ఏఈవో విఠల్ రావు, ఉపాధ్యాయుడు నరసింహ, పోలీస్ వీరన్న (జూనియర్ అసిస్టెంట్), రాజలింగం(సైబర్‌క్రైమ్) అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటేశ్, పంచాయతీ సెక్రటరీ సోనేశ్వర్, వట్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మణ్, చక్రపాణి, అడివప్ప, బాలాజీ, నాగరాజు, మల్లేశం పాల్గొన్నారు.

హక్కుల కోసం కొట్లాడే అభ్యర్థిని ఎన్నుకోవాలి

మెదక్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయుల హక్కుల కోసం కొట్లాడే అభ్యర్థులను ఎన్నుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గ టీచర్స్ అభ్యర్థిగా తనను రాష్ట్ర కమిటీ ప్రకటించిందన్నారు. శుక్రవారం మెదక్‌లోని టిఎన్జీవో భవన్‌లో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య, వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయ దర్శిని ఎడిటర్ శశిధర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు కొంగోటి యాదగిరి, సంగీత, మధుసూదన్‌రెడ్డి, నాయకులు యాదగిరి, గోపాల్ నాయక్, రాజేంద్ర ప్రసాద్, రాజయ్య, సురేందర్, నాగరాజు, పీర్ సింగ్, నజీర్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమూర్తి

పెద్దశంకరంపేట, నవంబర్ 15: చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మహంకాళి కృష్ణమూర్తికి రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు. జయ రాములు, గుజ్జరి కనకరాజులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.